# టోకెన్ నంబర్ సెవెన్టీన్

ఉదయంవేళ. ప్రశాంతి క్లినిక్ చాలా రద్దీగా వుంది. వెయిటింగ్ హాలులో రోగులు, వారి సంబంధీకులు కూర్చుని వున్నారు. చలాకీగా వున్న ఇరవైఏళ్ల అమ్మాయి టోకెన్స్ ఇచ్చి వాళ్ల పేర్లు రాసుకుని వరుసగా డాక్టర్‌గారి గదిలోకి పంపుతోంది. అందరితో పాటు టోకెన్ పట్టుకుని శంకరం. పిలుపుకోసం ఎదురు చూస్తున్నాడు. "నంబర్ సెవెన్‌టీన్. మీరేకదండి. వెళ్లండి". అందామ్మాయి శంకరం వంక చూస్తూ అరువు తెచ్చుకున్న గొంతుతో వయ్యారంగా. తలుపులు తెరుచుకున్నాయి. శంకరం లోపలికెళ్లాడు. గదిలో ఫాను సవ్వడి చేయ కుండా గాలి వీస్తోంది. గదిలో తడిసిన వట్టివేళ్ల పరిమళం. డాక్టర్ వంక చూసాడు శంకరం. మల్లెపూదండ మధ్య పండిన బంగినపల్లి మామిడిపండులా వున్నాడు డాక్టర్.

శంకరం కూర్చోగానే "ఎస్! ఏమిటి మీ ప్రాబ్లమ్?" అన్నాడు చిరునవ్వులు చిందిస్తూ. కానీ అంతలోనే చిరునవ్వు మాయమైంది.

"అరే నువ్వా? ఎప్పుడు వచ్చావు? అయినా ఇలా వచ్చేవేమిటి?" అన్నాడు నొసలు చిట్లిస్తూ.

"నేనీ ఊరికి వచ్చి మూడురోజులైంది. కానీ నిన్ను కలవాలని ఎంత ప్రయత్నించినా అవలేదు. ఈ రోజున ఎలాగైనా నిన్ను కలవాలని ఇలా వచ్చాను" అన్నాడు శంకరం.

"ఇంటికి రాలేకపోయావా? ఇంతకీ నీవు మెడికల్ ఎడ్వయిజ్ కోసం రాలేదుకదా?" అన్నాడు డాక్టర్ రిమ్‌లెస్ కళ్లద్దాల సరి చేసుకుని.

"భగవంతుని దయవల్ల నేను ఆరోగ్యంగానే వున్నాను. బస్సు దిగిన వెంటనే ఇంటికి వచ్చాను. కానీ నీవులేవు. నీవు ఇంటి దగ్గర ఎప్పుడు వుండేదీ చెప్పడం కష్టమంది వదిన. ఫోన్‌నెంబర్ ఇచ్చి ఈసారి వచ్చేటప్పుడు ఫోన్ చేసిరా అంది. ఈ రెండురోజులూ ఉదయం, సాయంత్రం ఇంటికి ఫోన్ చేస్తూనే వున్నాను. ఓ సాయంత్రం లైన్స్‌క్లబ్ మీటింగ్‌కి వెళ్లావంది. మర్నాడు అంబేద్కర్ జయంతి సభలకెళ్లావంది. ఇక గత్యంతరంలేక నీ క్లినిక్ చిరునామా వెతికి పట్టుకుని ఇలా వచ్చాను. గంటన్నర వేచి వున్న తరువాత నా టోకెన్ నంబర్ పిలిచారు. ఇప్పుడు నిన్ను చూడ్డం అయింది". అన్నాడు శంకర్ రుమాలుతో ముఖం తుడుచుకుని.

"అరెరె! ఇంతకీ వదిన నిన్ను గుర్తుపట్టలేదా?" అన్నాడు డాక్టర్ రివాల్వింగ్ చైర్‌లో వెనక్కి వాలుతూ.

"ఎందుకు గుర్తు పట్టలేదు? గుర్తు పట్టకపోతే జలగల్లామీ అన్నను పీల్చి పిప్పి చేయడానికి మీకు సిగ్గుల్లేవా? అని ఎందుకంటుంది? మీరు బంధువులుకారు రాబందులుఅని ఎందుకంటుంది?" అన్నాడు శంకరం. నల్లగా వుంటాడు. అయినా అతని కళ్లల్లో కోపం మండి ఒళ్లంతాపాకింది.

"అలాగందా? ఇంతకీ నీవు వచ్చిన పని?"

"చెప్పమంటే చెప్తాను. ఇంటికి వచ్చి చెప్పమంటే ఎంతసేపయినా వేచి వుండి ఇంటికి నీతోపాటు వచ్చి చెప్తాను. ఏమైనా నాకు పని జరగడం కావాలి". అన్నాడు శంకరం కుడి భుజం మీద వ్రేలాడుతున్న బ్యాగ్‌మీద చెయ్యివేసి దృఢంగా.

"ఫర్వాలేదు చెప్పు". అన్నాడు వాచీ చూసుకుంటూ.

"సరస్వతికి పెళ్లి కుదిరింది. కట్నం పాతికవేలు. నీవేమైనా సర్దగలవేమోనని నాన్న పంపారు. పెళ్లి ఖర్చులు నాన్నా, మేము సర్దుతాం".

"అంత పెద్ద కట్నాలిచ్చి సంబంధాలు చెయ్యకపోతేనేం? ముసలితనం మీద పడుడుతున్నకొద్దీ నాన్న బుద్ధి పని చేయడం లేదు". విసుగ్గా అన్నాడు డాక్టర్.

"పెద్ద సంబంధమేం కాదన్నయ్యా. పెళ్ళి కొడుకు కలెక్టర్ ఆఫీసులో డిస్పాచిక్లర్కు".

"డిస్పాచిక్లర్కుకి పాతికవేలా?"

"ఆ ఉద్యోగాన్ని ఆ అబ్బాయి కొనుక్కున్నాట్ట మరి".

"అయితే మాత్రం?"

"పోనీ నీవే చూడన్నయ్యా! చౌకలో మంచి సంబంధం. ఎక్కడికెళ్లినా మీ అన్నయ్య డాక్టర్‌కదా. ఆ మాత్రం ఇవ్వరా అని అడుగుతున్నారు. అయిదు, పదికి పెళ్లి కొడుకులు దొరికే రోజులు పోయాయి. ఇంకానయం ఈ అబ్బాయి చేతికి ఉంగరం తప్ప మరేమీ అడగలేదు".

"ఊరూరు తిరిగి సంబంధాలు వెతకడానికి నాకు టైమ్‌లేదు. ఇంకో మాట నేను డాక్టర్ అయినందుకే మిమ్మల్ని ఎక్కువ కట్నం అడుగుతున్నారంటున్నావు కదా. ఓ పని చేయండి. నన్ను మీ అన్నగా చెప్పకోకండి". అన్నాడు డాక్టర్.

"అవును. అది నిజమైన మాట". అన్నాడు వెంటనే.

"అన్నయ్యా ఏమిటా మాట?"

"ఉన్నమాటే. ఇంకోమాట కూడా చెప్తున్నాను. ప్రస్తుతం నేను ఏమీ సర్దలేను. ఓ ప్రక్కన నర్సింగ్‌హోమ్ కట్టిస్తున్నా. దానికెంతా చాలడంలేదు. వీలైతే పెళ్లికి వస్తా. అప్పుడేమైనా ప్రయత్నిస్తా".

"విరాళం కోసం ఒకాయన ఓ పెద్దమనిషి దగ్గరకెళ్లాడుట. గుడి కట్టేయగానే రండి. గుడిలో గంట కొనిస్తా అన్నాట్ట. నీవిచ్చేదేమైనా వుంటే అప్పుడు పెళ్లి... అప్పుడు నీ రాక".

"అయినా నేను చెప్పానుగా. నేనేమీ సర్దలేను. అయినా నీవూ, రమేశ్ సంపాదిస్తున్నారుగా".

"నేను ఎలిమెంటరీ స్కూలు టీచర్ని. వాడు బట్టల దుకాణంలో రోజువారీ కూలీ. మేము నీలాగా డాక్టర్లం కాము".

"డాక్టరు చదువు మిమ్మల్నెవరు చదవద్దన్నారు? మెడిసిన్ చదివుంటే మీకూ నా కష్టాలు తెలిసేవి?"

"నీ చదువుతోటే నాన్న చతికిలపడిపోయాడు. ఇంక మాకెక్కడ ఈ పెద్ద చదువులు?"

"చూడూ! నాన్న పంపిన సొమ్ముతోటే నా చదువు అవలేదు. ఈ మెడిసిన్ చదవడానికి ఎన్నో కష్టాలు పడ్డాను. చివరికి మీ వదిన నాన్నగారు, ఐ మీన్ మామగారు సహాయం చేస్తేగానీ చదువు పూర్తవలేదు".

"అవును ఇల్లు కట్టినవాడికన్నా నేమ్‌ప్లేట్ చెక్కి ఇచ్చినవాడు నీకు గొప్పవాడయ్యాడు. నాన్న చేసిన అప్పులు తీరకుండా నీవు పెళ్లి చేసుకున్నావు. చివరికీ నీ చదువుకోసం నాన్న చేసిన అప్పులు తీరే పరిస్థితి కనిపించకపోతే వున్న ఒక్కగానొక్క నీడను అమ్మవలసి వచ్చింది. అప్పులు తీరగా మిగిలిన దానికి కూడా వాటాకి వచ్చావు. నాన్న ఇచ్చినది, అమ్మ చేసిన సున్నుండలు పట్టుకుని నవ్వుతూ వెళ్లారు నీవూ వదినా గుర్తులేదా? నీ చదువు కోసమేకదా అక్క కరణీకం చేస్తున్న సుబ్బరాజుగారి అబ్బాయిని చేసుకుంది. ఏదో పెళ్లయిందని పించుకున్నాము గానీ ఏనాడైనా దాని అవసరాలు చూడగలిగామా? కరణీకం పోయిన తరువాతనైనా ఒక్కరోజైనా వెళ్లి వాళ్లే బాధలు పడుతున్నారో విచారించావా? కనీసం చెల్లెలికైనా మంచి సంబంధం చేద్దామనుకుంటే నీవు చెప్పే మాట ఇదేనా?"

"చూడు శంకరం. నేను చెప్పేదేదో నేను చెప్పాను. నీవు ఆవేశపడ్డా ప్రయోజనం ఏమీలేదు. ప్రస్తుతానికి నేనేమీ చేయలేను. డాక్టర్ చదువన్నా, డాక్టర్ వృత్తన్నా సుఖం అనుకోకు. ఇటీజ్ నాట్ బెడ్ ఆఫ్ రోజస్. ఇక నీవు వెళ్లు. నాకు సమయం చాలా విలువైనది" అంటూ "మేరీ! నెక్ట్స్". నిలబడ్డాడు శంకరం. తలెత్తకుండానే "ఇక వెళ్ళు" అన్నట్లు చెయ్యూపాడు డాక్టర్. శంకరం గది ఇవతలకొచ్చాడు. నాలుగుడుగులు వేసాడు.

"సార్!" పిలుపు విని వెనుదిరిగాడు. డాక్టర్ గది ఇవతల ఒకప్రక్క టేబుల్ ముందు కూర్చున్న నడివయస్సాయన పిలుస్తున్నాడు.

ఎందుకన్నట్టు దగ్గరికెళ్లాడు శంకరం.

"ఫీజు" అన్నాడతను.

"ఫీజా?"

"అవును, ఫిఫ్టీ రుపిస్!"

"ఆయన మాకు..."

"ఎవరైనా కావచ్చు. మీరు అపాయింట్‌మెంట్ తీసుకున్నారుకదా. టోకెన్ ఇచ్చాముకదా. మెడిసన్స్ ఎదురు మెడికల్ షాపులో తీసుకోవచ్చు. ఎక్స్‌రే... ఇసిజి..."

"నాకవేమీ అక్కర్లేదు. అసలు నాకే జబ్బులేదు" .

"మీకు జబ్బు లేకపోవడం మాకు చాలా సంతోషం సార్. కానీ టోకెన్లకి

సరిపడా అమౌంట్ మేము లెక్క చూపించాలి కదండి సార్".

"ఒకవేళ మీరేదైనా చెప్పదల్చుకుంటే వెళ్లి చెప్పండి సార్. ఆయన వద్దంటే మాదేముందండి". అన్నాడు తనే మళ్లీ.

"వద్దులెండీ" అంటూ జేబులో చెయ్యి పెట్టి అంతా పైకి లాగి "ఇదిగో మీ ఫీజు". అంటూ లెక్క పెట్టి టేబుల్ మీద పెట్టాడు.

ఇంతలో ఇంటర్‌కమ్ మోగింది.

మేరీ రిసీవరెత్తి "సీతాపతిగారూ! మీకే! అంది.

సీతాపతి ఫోన్ దగ్గరికి పరుగెట్టాడు. ఫోన్ అందుకుని శంకరాన్ని చూస్తూ "అలాగే సార్". అన్నాడు.

"మీ వద్ద ఫీజు తీసుకోవద్దన్నారు డాక్టర్‌గారు". అన్నాడు టేబుల్ దగ్గరకొస్తూ సీతాపతి.

"ఎందుకో చెప్పారా?"

"చెప్పలేదు సార్ బహుశా మీకే జబ్బు లేదు కదండి సార్".

"ఓ అందుకా! ఫర్వాలేదు. అయిదుపూటలా అర్ధాకలి, మూడు రాత్రుల నిద్ర లేమి, ఆరు ప్రజా టెలిఫోన్ కాల్స్ ముందు అంతకుమించి ఇక్కడ నుండి నేను పట్టుకెళ్లే దానిముందు ఇది ఎంతో కాదు". అంటూ కదలబోయాడు శంకరం.

"మీ పేరు చెప్పండి సార్" అన్నాడు సీతాపతి.

"ఎందుకు?"

"రసీదు రాయాలి కదండి సార్".

"అయితే రాసుకోండి. టోకెన్ నెంబర్ సెవెన్‌టీన్" అని గబగబా అవతలికి కదిలాడు శంకరం. కాదు.... టోకెన్ నెంబర్ సెవెన్‌టీన్.

* * *